సాక్షి
పెద్దపల్లి
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



సోలార్ ప్లాంట్ సందర్శన

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టు, 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సందర్శించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.



భానుడి ఎఫెక్ట్

ఫెర్టిలైజర్‌సిటీ: రెండురోజులుగా ఎండతీవ్రత అధికంగా నమోదవుతోంది. శుక్రవారం ఉదయం 10గంటలకే ఎండ అధికం కావడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్ నిర్మానుష్యంగా కనిపించింది.

గరిష్టం/కనిష్టం
43.0/25.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయవాదులే కీలకం



మాట్లాడుతున్న జడ్జి రాజ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: న్యాయాన్ని రక్షించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్తున్న గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్ అన్నారు. ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అదనపు జిల్లా న్యాయస్థానంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు.16 నెలల పాటు గోదావరిఖనిలో తనకు సహకారం అందించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెండో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ, ఏజీపీ మేడ చక్రపాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సభ్యులు గుర్రం నారాయణ, రామ్‌టెంకి శ్రీనివాస్, గోసిక ప్రకాశ్, గుజ్జేటి సత్యనారాయణ, పులిపాక ప్రవీణ్‌కుమార్, చెలికల పద్మజ, ఇరుగురాల మహేందర్, దూడపాక లింగస్వామి, భానుకృష్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల బదిలీ

గోదావరిఖనిటౌన్/సుల్తానాబాద్: జిల్లాలోని పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హై కోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) ఉత్తర్వులు జారీచేశారు. 21 మందిని రాష్ట్రవ్యాప్తంగా బదిలీ చేయగా వీరిలో గోదావరిఖనిలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు రంగారెడ్డి ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్.మంజులను నియమించారు. గోదావరిఖనిలోని 1వ అదనపు న్యాయమూర్తిగా ఆర్.స్వారికను నియమించారు. ఇక్కడ ఉన్న దుర్గం గణేశ్‌ను సుల్తానాబాద్ మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. సుల్తానాబాద్ జడ్జి జీఎస్‌ఎల్ ప్రియాంకను కూకట్‌పల్లికి బదిలీ చేశారు.


వసతులు కల్పించాలి



పెద్దపల్లిలోని పోలింగ్ కేంద్రంలో రవీశ్‌గుప్తా

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని సాధారణ ఎన్నికల పరిశీలకుడు రావీశ్‌గుప్తా సూచించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్, స్థానిక వ్యవసాయ మార్కెట్, సుల్తానాబాద్‌లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని నీడ, తాగునీటి వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సహాయ ఎన్నికల అధికారి గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి



బోర్‌వెల్ పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

ఎలిగేడు(పెద్దపల్లి): ఎండలు మండుతున్న దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. ముప్పిరితోటలో ఆమె పర్యటించారు. మిషన్ భగీరథ ట్యాంకులు, రక్షిత మంచినీటిబావులు, పారిశుధ్యం నిర్వహణ తీరు, సెగ్రిగేషన్‌షెడ్లు, నర్సరీలను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యశశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మల్టీసేవలతోనే సహకార సంఘాల అభివృద్ధి

సుల్తానాబాద్‌రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(సింగిల్‌విండో)మల్టీపర్పస్ సేవలు అందిస్తేనే ఆర్థికంగా బలపడతాయని జిల్లా సహకార అధికారి శ్రీమాల అన్నారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దేవునిపల్లిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావుతో కలిసి శుక్రవారం ఆమె పునఃప్రారంభించి మాట్లాడారు. బ్యాంక్ మేనేజర్‌లు శశిధర్‌రావు, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సాగర్‌రెడ్డి, కేడీసీసీబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు వాహనం తనిఖీ

సుల్తానాబాద్‌రూరల్: దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు వాహనాన్ని పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి మంథని వెళ్తున్న మంత్రి వాహనాన్ని పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. శ్రీధర్‌బాబు పోలీసులకు సహకరించి వారితో సన్నిహితంగా మాట్లాడారు. తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సూచించారు.

తమ్మీ.. తప్పుకో..

- 'అన్నా.. నామినేషన్నైతే వేశాం.. నియోజకవర్గమంతా తిరిగి ప్రచారం చేయడం మనవల్ల కాని పని.. ప్రధానపార్టీ అభ్యర్థి ఎవరైనా నామినేషన్ విత్‌డ్రా చేసుకోమని మంచిఆఫర్‌తో సిద్ధంగా ఉన్నాం..'

– కొందరు అభ్యర్థులు.. ప్రధాన పార్టీల అభ్యర్థులతో ఇలా మంతనాలు సాగిస్తున్నారు.

- 'అసలే ఎండలు దంచికొడుతున్నాయి.. దీనికితోడు ప్రచార ఖర్చు తడిసిమోపడవుతున్నది. పెద్దపల్లి ఎంపీకి ఏకంగా 63 మంది నామినేషన్ వేశారు. సుమారు ఐదు ఈవీఎంలు ఉపయోగిస్తారు. వీటిని చూసి ఓటర్లు తికమకపడే అవకాశాలున్నాయి. సాధ్యమైనంత మందిని విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నాలు చేద్దాం'

– తమ ముఖ్య అనుచరులతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రణాళికలు ఇవి.



- పెద్దపల్లి బరిలో 49 మంది అభ్యర్థులు
- 15కు మించితే రెండు ఈవీఎంలు
- యంత్రాలు ఎక్కువైతే ఓటర్లు తికమకపడే అవకాశం
- నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులతో నేతల మంతనాలు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల్లో గెలుపు కోసం అన్నిపార్టీల నేతలు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఏఒక్క చిన్నవిషయాన్నీ వదలకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి 63మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారులు శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. తిరస్కరించిన వాటిలో 24 నామినేషన్లు ఉన్నాయి. 49మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో ఉండటంతో సుమారు 5 ఈవీఎంలను ఉపయోగించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో పోలింగ్ రోజు ఓటర్లు తికమకపడే అవకాశం ఉంది. అలాగే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులుపడే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల బరిలో 15మంది అభ్యర్థులు ఉండేలా తెరవెనకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, వారితో సన్నిహితంగా ఉండేవారితో రాయ'బేరాలు' కొనసాగిస్తున్నారు.

ఉపసంహరణకు యత్నాలు

- నామినేషన్ల ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనుంది.
- ఈనేపథ్యంలో ఎన్నికల బరిలో నుంచి స్వతంత్రులుగా పోటీచేసిన అభ్యర్థులతో కొందరు మంతనాలు సాగిస్తున్నారు.
- ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా, అందులో చివరిది నోటాకు కేటాయిస్తారు.

14మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ



నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయిందని పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు 63మంది అభ్యర్థులు 109 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయిందని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సక్రమంగాలేని 14మంది అభ్యర్థుల నామిషన్లను తిరస్కరించామని ఆయన వివరించారు. మిగతా 49మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఆయన వివరించారు.

- పోటీలో 15 మందికి మించితే రెండోఈవీఎంనూ ఉపయోగించాల్సి ఉంటుంది.
- పెద్దపల్లి ఎంపీ స్థానంలో 49 మంది బరిలో ఉండగా, 34 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. దీంతో వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాలు చూపి పోటీనుంచి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు.
- వీరి ప్రయత్నాలు ఏమేరకు ఫలించనున్నాయో సోమవారం తేలనుంది.

మండిన ఎండ

- మంథనిలో 45.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు
- రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు







సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో భానుడు భగభగలతో సెగలు కక్కాడు. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవగా.. రెండో అత్యధిక ఉష్ణోగ్రతలు మంథనిలో నమోదయ్యాయి. ముత్తారం, అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, పెద్దపల్లి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, రామగిరి మండలాల్లోని చాలాప్రాంతాల్లో 43 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడురోజులు ఎండలు మరింత మండుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పుడే ఈపరిస్థితి ఉంటే మేలో ఎలా ఉంటుందనే దానిపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలను వాతావరణ శాఖ రెడ్, ఆరెంజ్ జోన్‌లో చేర్చింది. ఎండలు మండుతుండటంతో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు నిరంతరం పనిచేస్తున్నాయి. దీంతో కరెంట్ వినియోగం రెండురెట్లు అధికంగా కాలుతోందని అధికారులు తెలిపారు.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో..)

ప్రాంతం	ఉష్ణోగ్రతలు
మంథని	45.2
సుగ్లాంపల్లి	44.7
కాల్వచర్ల	44.7
భోజన్నపేట	44.5
ఆకేనపల్లి	44.3
ముత్తారం	44.3
కునారాం	44.0
ఈసాలతక్కలపల్లి	44.0
శ్రీరాంపూర్	44.0
కమాన్‌పూర్	43.6
రంగంపల్లి	43.5

జాగ్రత్తలు అవసరం



వడదెబ్బ లక్షణాలు కనిపించిన వ్యక్తిని వెంటనే నీడ లేదా చల్లని ప్రదేశానికి తరలించాలి. చల్లని నీటితో స్పాంజ్, ఐస్‌ప్యాక్‌లు లేదా నుదురు, మెడ, శరీరాన్ని తడి టవల్‌లో తుడిచి వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి. ప్రతి ఒక్కరూ వదులుగా ఉండే, తేలికపాటి లేతరంగు దుస్తులు ధరించాలి. ఉదయం 10 గంటల తర్వాత సాయంత్రం 3 గంటల్లోపు అత్యవసరమైతే తప్ప ఇళ్ల విడిచి బయటకు రాకపోవడమే మంచిది. ఉప్పు కలిపిన నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ఓఆర్‌ఎస్ లాంటి ద్రావణాలు, ఎక్కువ నీటిశాతం ఉండే పండ్లు తీసుకోవాలి.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

నేరస్తులపై పీడీ యాక్ట్‌కు సిద్ధం

- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేదిలేదు
- రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరిక



శ్రీనివాస్

గోదావరిఖని: చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందుకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. తాను సీపీగా బాధ్యతలు స్వీకరించిన ఫిబ్రవరి–14 నుంచి ఇప్పటివరకు నమోదు చేసిన కేసుల వివరాలను శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు తమ నేర ప్రవృత్తి మార్చుకోవాలన్నారు. నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో గంజాయి రవాణా, పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా, నకిలీ విత్తనాల రవాణా, పేకాట, కోడిపందాలు, గుడుంబా తయారీ, రవాణా, ఇల్లీగల్ ఫైనాన్స్, అనుమతిలేని చిట్‌ఫండ్స్ కేసులు నమోదు చేశామని వివరించారు. భూకబ్జాదారులు, అనుమతిలేని లేఅవుట్ వెంచర్లు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టామన్నారు. నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ ప్రశాంతమైన వాతావరణం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై పీడీయాక్ట్ అమలు చేసేందుకు నేరస్తుల జాబితా సిద్ధం చేశామని ఆయన వివరించారు.

కేసుల వివరాలు ఇవీ..

- ఇప్పటి వరకు 16 కేసులు నమోదు చేసి 42 మందిని అరెస్ట్ చేసి రూ.4.65లక్షల విలువైన 13.228 కిలోల గంజాయి స్వాధీనం
- పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై 48 కేసుల్లో 70మందిని అరెస్ట్ చేసి రూ.17.94లక్షల విలువైన 969క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- అక్రమ ఫైనాన్స్ నిర్వహిస్తున్న 24మందిపై కేసులు నమోదు
- ప్రధానమంత్రి కౌశల్య పథకాన్ని దుర్వినియోగం చేసిన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ నిర్వాహకులపై కేసు
- 105మందిపై కేసు నమోదు రూ.2.01లక్షల విలువైన 513 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 181 మందిపై కేసు నమోదు చేసి రూ.8.34లక్షల విలువైన 1,449 లీటర్ల మద్యం స్వాధీనం.
- పేకాట ఆడుతున్న 184 మందిపై కేసు నమోదు చేసి రూ.22.15లక్షల నగదు సీజ్
- ఇసుక అక్రమ రవాణా చేసిన 40 కేసుల్లో 87 మందిని అరెస్ట్ చేసి రూ. 4.38లక్షల విలువైన ఇసుక, 50ట్రాక్టర్లు, ఒక డీసీఎం వ్యాన్, మూడు జేసీబీలు సీజ్
- డీజిల్ దొంగతనం వ్యవహారంలో రెండు కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.5.26లక్షల విలువైన 5,325లీటర్ల డీజిల్ స్వాధీనం చేసినట్లు సీపీ వెల్లడించారు.


పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ గురించి వివరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాధారణ పరిశీలకుడు రావీశ్‌గుప్తాతోపాటు అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో 763 పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీవోల ప్రక్రియ ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం చేపట్టినట్లు వివరించారు. ధర్మపురి అసెంబ్లీ పరిధి ధర్మారం మండలంలోని 53 పోలింగ్ కేంద్రాలకు 62 మంది సిబ్బందిని కేటాయించామని అన్నారు. ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్, డీఈవో మాధవి, అధికారులు అనిల్, అజీం, ఈడీఎం కవిత పాల్గొన్నారు.

పతనమైన ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం పతనమవుతోందని, ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుల, మతాల మధ్య ఆ సర్కార్ చిచ్చు రేపుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు తమ పార్టీ మద్దతు ఉంటుందని ప్రకటించారు. పెద్దపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు విజయరమణారావు, గడ్డం వివేక్‌తో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

చిన్నిప్రాణుల చలివేంద్రాలు

- పశువులు, పక్షుల దాహం తీర్చేందుకు నీటితొట్టిలు
- రామగుండం బల్దియాలో తొలిసారి ఏర్పాటు



నీటితొట్టిలో నీళ్లు పోస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ(రామగుండం): వేసవి నీటిచుక్క కోసం అల్లాడిపోతాం.. కాలు బయటపెడితే.. కాసిన్ని నీళ్ల ఎక్కడ దొరుకుతాయా? అని ఆశగా వెతుకుతాం.. ఎప్పటికప్పుడు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఏదోఒక రూపంలో నీటిని తాగేస్తాం .. అందుకే వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చాలాచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? చుక్కనీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి. పక్షిజాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి కూడా ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పక్షులు, పశువుల దాహం తీర్చడానికి రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. నగరంలో సుమారు 50 ప్రాంతాల్లో నీటి తొట్టిలు ఏర్పాటు చేయడానికి నడుం బిగించారు. ప్రభుత్వం కూడా వేసవిలో పక్షులు, పశువుల దాహం తీర్చేందుకు నీటితొట్టిలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

ప్రారంభించిన కమిషనర్..

- పశువులు, పక్షుల దాహం తీర్చడానికి నగరంలో వివిధ చోట్ల నీటి తొట్టిలు ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం 11 ప్రాంతాల్లో వాటిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది సహకారంతో పశువులు ఎక్కువగా సంచరించే 12 ప్రాంతాలు గుర్తించారు. ఆ ప్రాంతాల్లో దశలవారీగా నీటితొట్టిలు ఏర్పాటు చేస్తారు. ట్యాంకర్ల ద్వారా ఇందులో నీళ్లు నింపుతారు. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ ఎస్ఈ చిన్నారావు, డీఈఈ జమీల్, ఏఈ తేజస్విని పాల్గొన్నారు.

పక్షుల రక్షణకు...

సాధారణంగా పక్షుల శరీర సాధారణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్. ఈ ఉష్ణోగ్రతలు దాటితే ఎక్కువసేపు జీవించలేవు. అందుకే చాలాపక్షులు ఎక్కడ నీరు కనిపిస్తే అక్కడకు చేరుకుని నీళ్లలో మునకేస్తూ శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకుంటాయి. ప్రస్తుతం నగరంలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకు పైగా నమోదవుతున్నాయి. ఈ తరుణంలో పక్షుల సంరక్షణకు బల్దియా కమిషనర్ నడుం బిగించారు.

శునకాల డీహైడ్రేషన్‌కు చెక్..

వేసవిలో ఎండల వేడి, ఉక్కపోతను తట్టుకోలేక శునకాలు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. అప్పటికే పెరిగిన ఉష్ణోగ్రతలతో స్వభావం మారిపోయిన శునకాలకు ఆహారం, నీరు దొరకక దూకుడుగా ప్రవర్తిసాయి. ఇలాంటి సమయంలో కుక్కలు కరిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు శునకాలు, పశువులు ఎక్కువగా సంచరిస్తున్న ప్రాంతాల్లో చెట్ల నీడన అధికారులు నిటితొట్టిలు ఏర్పాటు చేస్తున్నారు.

మోసాల కాంగ్రెస్‌ను ఓడిద్దాం

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్, కూనారం క్రాస్‌రోడ్డు, సుభాష్‌నగర్, జెండా చౌరస్తా వద్ద శుక్రవారం జరిగిన కార్నర్ మీటింగ్‌ల్లో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి పార్టీ అధినేత కేసీఆర్‌కు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిఘా నీడలో సోషల్ మీడియా

- రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలుకే
- వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లపై నిరంతరం పోలీసుల పర్యవేక్షణ

గోదావరిఖని: సోషల్ మీడియా రామగుండం కమిషనరేట్ పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరింత అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రధానంగా ప్రజలను రెచ్చగొట్టేలా, ఇబ్బంది పెట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ చేసేవారిపై దృష్టి పెట్టారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ నిఘా పెంచారు. ఇందుకోసం సోషల్ మీడి యా ట్రాకింగ్ సెంటర్(ఎస్ఎంటీసీ) ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. దీనిద్వారా ప్రత్యేక విభాగం నిరంతర నిఘా కొనసాగిస్తోంది.

పెరుగుతున్న కేసులు..

- కొంతకాలంగా సోషల్ మీడియాలో ఇబ్బందికర, నిబంధనలకు విరుద్ధంగా వైరల్ చేస్తున్న పోస్టులపై ఫిర్యాదులు అధికంగా రావడంతో రామగుండం కమిషనరేట్ పోలీసులు నమోదు చేసే కేసుల సంఖ్య పెరుగుతోంది.
- కొందరు చేసిన పోస్టింగ్‌లతో ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.
- ప్రస్తుతం సైబర్‌క్రైం అగ్రస్థానంలో ఉండగా తర్వాత సోషల్ మీడియా పోస్టులపై కేసులు రెండోస్థానంలో ఉంటున్నాయని అంటున్నారు.
- గత రెండేళ్లలో రామగుండం కమిషనరేట్‌లో ఇలాంటివి 39 కేసులు నమోదయ్యాయి.
- ఈఏడాది నాలుగు నెలల్లోనే 17 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు.
- చట్టవిరుద్ధమైన పోస్టులు వైరల్ చేసేవారిపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 కింద కేసులు నమోదు చేయడానికి పోలీసుశాఖ సిద్ధమవుతోంది.

కించపరిచే వ్యాఖ్యలు పోస్టు చేస్తే తిప్పలే

తమ చేతిలో సెల్‌ఫోన్ ఉంది కదా అని ఇష్టానుసారంగా పోస్టులు వైరల్ చేస్తే ఇకపై కేసులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కులాలు, మతాలతోపాటు కొన్ని వర్గాలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే కోర్టు చుట్టూ తిరగాల్సిందే. ఎక్కడో జరిగిన సంఘటనను ఇక్కడే జరిగినట్లు, తాము చూసినట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఫార్వర్డ్ చేస్తూ కొన్నివర్గాలను రెచ్చగొట్టేలా పోస్టులు వైరల్ చేస్తే పోలీసుశాఖ ఊరుకోబోమంటోంది. సమాజంలో అనవసరపు ఉద్రిక్తలు చోటుచేసుకుంటాయని అంటోంది.



సోషల్ మీడియాపై పర్యవేక్షణ చేస్తున్న మానిటరింగ్ సెల్ విభాగం సిబ్బంది

రామగుండం కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులు

ఏడాది	మంచిర్యాల	పెద్దపల్లి	మొత్తం
2022	16	07	23
2023	07	09	16
2024(ఇప్పటివరకు)	12	05	17

ఇకనుంచి సోషల్ మీడియాలో పోస్టులు చేసే ముందు ఆలోచించి ముందుకు వెళ్లాలని సూచిస్తోంది.

ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లపై నిఘా

- ప్రస్తుతం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడంలో ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు చాలా కీలకంగా పనిచేస్తున్నాయి. వీటిద్వారా ఎంతోత్వరగా సమాచారం చేరుతోంది. ఇదేక్రమంలో ఉద్రిక్తలు కూడా పెరిగిపోతున్నాయి. కులాలు, మతాలు, మహిళలు, ఇతర వర్గాలను కించపర్చేలా చేసేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు రామగుండం పోలీసుశాఖ సిద్ధమవుతోంది. కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపేందుకు వెనకాడేది లేదంటోంది.

శాంతిభద్రతల పరిరక్షణ ముఖ్యం



శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఎంతటి వారినైనా వదిలేది లేదు. సోషల్ మీడియాలో పోస్టులపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాం. కొందరు ఇబ్బందికర పోస్టులు పెడుతున్నారు. రాజకీయ నేతలు టార్గెట్‌గా, మతం, మత ప్రముఖుల్ని లక్ష్యంగా చేసుకుని మరికొందరు పోస్టులు వైరల్ చేస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పుకార్లు ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి వారికి కేసు తీవ్రతను బట్టి జీవితఖైదు పడే అవకాశం ఉంటుంది.

– శ్రీనివాస్, సీపీ, రామగుండం పోలీస్ కమిషనర్

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సంత్ కబీర్, నేషనల్ హ్యాండ్ లూమ్ అవార్డు- 2023 కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ తెలిపారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, డిజైన్‌లో నైపుణ్యం కనబరచిన, ఆ రంగంలో విశిష్ట సేవ చేసిన చేనేత కళాకారులకు ప్రతిష్టాత్మక సంత్ కబీర్, నేషనల్ హ్యాండ్ లూమ్ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల వారు మే 25 లోపు www.handlooms.nic.in లో నిర్దేశిత B1 ,B2 దరఖాస్తు ఫాంలు నింపి మూడు కాపీల దరఖాస్తు ఫాంలను weavers service centre, Hyderabad కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఒడిశా రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్, టెక్నాలజీ, బార్గా కళాశాలలో 3 సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్, టెక్స్ టైల్ టెక్నాలజీ కోర్సుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయి 16 జూలై 2024 నాటికి జనరల్ కేటగిరీలో 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో 15 నుంచి 25 ఏళ్ల నిండినవారు అర్హులని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు 9 సీట్లు కేటాయించారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 లోపు దరఖాస్తులను నిర్దేశిత ఫార్మాట్‌లో నెల్లూరు జిల్లాలోని The principal spkm Indian institute of handloom technology venkatagiri, పిన్ కోడ్ 524132 అనే చిరునామాకు పంపాలని లేదా జిల్లా కేంద్రంలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.iihtbargarh. org.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియం, 7 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు గల రాష్ట్రంలోని చెవిటి (బధిర) బాలబాలికలకు ప్రవేశము కల్పించబడునని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల వారికి ప్రవేశములో ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, స్కూలు యూనిఫాం, భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ కావాలనుకునే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, టీసీ, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తులను మల్కాపూర్‌లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 90000 13639, 90002 21301, 96668 68755, 94914 76253 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లంక శేఖర్‌పై రౌడీ షీట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ విద్యారణ్యపురికి చెందిన లంక శేఖర్(52)పై శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఓపెన్ చేశామని సీఐ ఎ.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరుస నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగజేస్తూ ప్రజల శాంతికి భంగం కలిగించడమే కాకుండా.. బెదిరింపులకు గురిచేసి భూఆక్రమణలకు పాల్పడుతున్నాడని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ప్రతిపాదన మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ అనుమతించగా.. రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఈయన నాలుగు కేసు ల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

రెండు జిల్లాలు.. 22 మంది నేతలు

- మావోయిస్టుల లొంగుబాటే లక్ష్యం
- నక్సల్స్ నాయకులపై భారీ రివార్డులు
- సమాచారం ఇచ్చిన వారికి నజరానా
- ప్రకటించిన పోలీస్ అధికారులు
- రామగుండం కమిషనరేట్ పరిధిలో విస్తృత ప్రచారం


పెద్దపల్లి జిల్లాలోని మావోయిస్టుల పోస్టర్


మంచిర్యాల జిల్లాలోని మావోయిస్టుల పోస్టర్

గోదావరిఖని: మావోయిస్టులు పోరుబాట వీడి బ్యాలెట్ బాట పట్టాలనే లక్ష్యంతో రామగుండం పోలీసు యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. తొలిదశలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మావోయిస్టు అగ్రనేతల పేర్లు, ఫొటోలతో ముద్రించిన వాల్‌పోస్టర్లను గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని గోడలపై అంటిస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్‌లో 29మంది మావోయిస్టులు మృతి చెందారు. మరికొందరు తప్పించుకున్నారు. వారు మన రాష్ట్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. సరిహద్దు జిల్లాల్లో కూబింగ్ ముమ్మరం చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఒకవైపు వారిని కట్టడి చేస్తూనే మరోవైపు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసేలా పిలుపునిస్తోంది. చట్టసభలకు ఎన్నికై పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాలని ఆహ్వానిస్తోంది. ఇంకోవైపు.. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని మావోయిస్టుల తలపై ఉన్న రివార్డుల వివరాలు వెల్లడించింది. ఈ రెండు జిల్లాలో అజ్ఞాతంలో 22మంది కీలక మావోయిస్టు నేతలు ఉన్నట్లు ప్రకటించింది.

పెద్దపల్లి జిల్లాలో కీలక నేతలు వీరే..

- పెద్దపల్లి జిల్లాకు చెందిన అజ్ఞాతంలో వివిధ స్థాయిల్లో ఉన్న కీలక మావోయిస్టు నేతలు, వారిపై ఉన్న రివార్డును పోలీసు యంత్రాంగం ప్రకటించింది.
- పెద్దపల్లికి చెందిన మల్లోజుల వేణుగోపాల్‌రావు ఉరఫ్ ప్రహల్లాద్ ఉరఫ్ వివేక్, భూపతి, సోను దాదా ఉరఫ్ అభయ్‌పై ప్రభుత్వం రూ.25లక్షల రివార్డు ప్రకటించింది.
- అదేవిధంగా మంథని మండలం శాస్త్రులపల్లెకు చెందిన మల్లా రాజిరెడ్డి ఉరఫ్ సత్తన్న, సాయన్న, మీసాల సత్తన్న, సాగర్, అలోక్, దేశ్‌పాండే, లక్ష్మణ్ ఉరఫ్ గోపన్నపై రూ.25లక్షల రివార్డు ఉంది.
- జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామానికి చెందిన పుల్లూరు ప్రసాదరావు ఉరఫ్ శంకరన్న, శంకర్‌రావు, చంద్రన్న ఉరఫ్ మల్కాపురం భాస్కర్‌పై రూ.25లక్షల బహుమతి ఉంది.
- పాలకుర్తి మండలం సబితం గ్రామానికి చెందిన గంకిడి సత్యనారాయణరెడ్డి ఉరఫ్ విజయ్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన కంకణాల రాజిరెడ్డి ఉరఫ్ వెంకటేశ్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఎగోలపు మల్లయ్యపై రూ.5లక్షల రివార్డు ప్రకటించారు.
- పెద్దపల్లి మండలంలో పాలితం గ్రామానికి చెందిన ఆలేటి రామలచ్చులుపై రూ.8లక్షల రివార్డు ఉంది.
- రామగుండం మండలం ఎఫ్‌సీఐకి చెందిన అప్పాసి నారాయణ ఉరఫ్ రమేశ్, ఉరఫ్ శంకర్‌పై రూ.5లక్షల రివార్డు ఉంది.
- పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఉరఫ్ పాశం నర్సయ్య, మోహన్, జోగన్నపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- గోపయ్యపల్లెకు చెందిన దాతు ఐలయ్యపై రూ.5లక్షల రివార్డు
- జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన డీకొండ శంకయ్య ఉరఫ్ శేషన్నపై రూ.5లక్షల రివార్డు
- సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన జువ్వడి వెంకటేశ్వర్‌రావు ఉరఫ్ ధర్మన్నపై రూ.4లక్షల రివార్డు ప్రకటించారు.

మంచిర్యాల జిల్లాలోని మావోయిస్టులు వీరే..

- మంచిర్యాల జిల్లాకు చెందిన 10మంది కీలక మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో..
- మందమర్రి ఒకటో జోన్‌కు చెందిన బండి ప్రకాశ్ ఉరఫ్ బీపీ, ప్రభాకర్, క్రాంతి, బండి దాదాపై రూ.20లక్షలు రివార్డు ప్రకటించారు.
- తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు ఉరఫ్ దామోదర్‌పై రూ.20లక్షల రివార్డు ఉంది.
- బోథ్ మండలం పోచర గ్రామానికి చెందిన మైలారపు అడెల్లు ఉరఫ్ భాస్కర్‌పై రూ.20లక్షల రివార్డు
- బెల్లంపల్లి మండలం కన్నాలబస్తీకి చెందిన సలకల సరోజ ఉరఫ్ లతపై రూ.20లక్షల రివార్డు ప్రకటించారు.
- బెల్లంపల్లి మండలం కన్నాలబస్తీకి చెందిన కాసరబోయిన రవి, ఉరఫ్ విజయ్, అశోక్‌పై రూ.5లక్షల రివార్డు ఉంది.
- కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న ఉరఫ్ గోపన్న, రాజప్ప, గంగన్న, భీమన్నపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి వెంకటి ఉరఫ్ సురేశ్, మంగన్నపై రూ.5లక్షల రివార్డు
- బెల్లంపల్లి మండలం శాంతిఖనికి బస్తీకి చెందిన ఆరెపల్లి కృష్ణ ఉరఫ్ కిష్టపై రూ.5లక్షల రివార్డు ఉంది.
- బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప ఉరఫ్ అవుల బాలమ్మ, రాజేశ్వరి, రాజేశ్వరక్కపై రూ.5లక్షల రివార్డు ప్రకటించారు.
- మందమర్రికి చెందిన బబ్బెర రవి ఉరఫ్ రవిపై రూ.లక్షల రివార్డును ప్రకటించారు.

తుపాకీ వీడండి



మావోయిస్టులు తుపాకీ బాట వీడి బ్యాలెట్ బాట పట్టాలి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై పోలీసు నుంచి గౌరవ వందం స్వీకరించాలి. అడవుల బాటపట్టి ఇన్నాళ్లు సాధించిందేమీ లేదు. లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న రివార్డులను వారికే అందజేస్తాం.
– శ్రీనివాస్, పోలీసు కమిషనర్, రామగుండం

ఆపరేషన్ లేకుండా గుండెకు అరుదైన చికిత్స

- సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యుల ఘనత


మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్ర చికిత్స చేసి ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గోదావరిఖనికి చెందిన నరెడ్ల సుజాత ఏడాదిగా దగ్గుతో ఇబ్బందులు పడుతున్న క్రమంలో 8 నెలల క్రితం తమ ఆస్పత్రికి వచ్చిందని, ఆమెకు పరీక్షలు నిర్వహించగా గుండెకు సంబంధించిన అయోటా పైప్ ఉబ్బినట్లు గుర్తించామని పేర్కొన్నారు. సాధారణంగా ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా దీన్ని సరిచేయాలని, కానీ ఆ పద్ధతిలో రిస్క్ ఎక్కువ ఉన్నందున ఆమెకు తొడ నరము నుంచి అయోటిక్ స్టంట్ వేసి కాపాడినట్లు తెలిపారు. ఆపరేషన్ లేకుండా గుండె వాల్వులను కూడా రిప్లేస్మెంట్ చేస్తున్నామని వివరించారు. ఇటీవల కార్డియాక్ అరెస్టుల సంఖ్య పెరుగుతుందని, దీనికి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు, ధూమపానం, మద్యపానం ఆరోగ్యకరమైన జీవనశైలి లేకపోవడమని పేర్కొన్నారు. తాము అందించిన చికిత్స ద్వారా సుజాత పూర్తిగా కోలుకొని, 8 నెలలుగా ఆరోగ్యంగా జీవిస్తోందన్నారు. అనంతరం సుజాత మాట్లాడుతూ, తాను బతుకుతానని అనుకోలేదని, యశోద ఆస్పత్రి వైద్యులు అందించిన అధునాతన వైద్యంతో ఇప్పుడు సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు ఏ ఆసుపత్రికి వెళ్లినా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని, రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారని పేర్కొన్నారు. యశోద ఆసుపత్రిలో ఆపరేషన్ లేకుండా, ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ ఖర్చులో చేశారని, పునర్జన్మను అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిసైన భర్త తన భార్యను రోకలి బండతో కొట్టి చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదుతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతను మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వివాహం చేసుకున్నాడు. తర్వాత బక్కయ్య ఇంటి ముందు గల మహమ్మద్ సాబీర్(30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ సంఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం చొప్పదండి మండలం మంగళపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబంతో సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తోంది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడి ఆమెను రోకలి బండతో తీవ్రంగా గాయపరచడంతో.. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సాబీర్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ లక్ష్మీబాబు ఈ కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు సాబీర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


గంగాధర్(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లులకు చెందిన ముదాం గంగాధర్ (38) శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా వీఆర్‌ఎం గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. గంగాధర్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గంగాధర్ కోరుట్ల వెటర్నరీ ఆస్పత్రిలో అటెండర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని జగిత్యాల యువకుడు..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. జగిత్యాలలోని హన్మాన్‌వాడకు చెందిన పాదం వంశీకృష్ణ (28) గురువారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన గాలిపల్లి నవీన్ తన ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపి వంశీకృష్ణ వాహనాన్ని ఢీకొట్టాడు. వంశీకృష్ణ బలంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో గురువారం రాత్రి పోగుల అశోక్ (40) అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సారంగాపూర్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన పోగుల అశోక్ మల్యాల మండలం రాజారంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై ధరూర్ గొల్లపల్లి బైపాస్ రోడ్డు మీదుగా జగిత్యాల వస్తుండగా మోతె శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనలతో కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఉచిత పథకాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్

కమాన్‌పూర్(మంథని): ఉచిత పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ వాటితోనే ప్రచారం చేస్తోందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా శుక్రవారం రొంపికుంట, నాగారం గ్రామాల్లోని ఉపాధిహామీ పనిస్థలాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కూలీలతో మాట్లాడారు. ఉచిత పథకాలని ఆడబిడ్డలకు ఆశ చూపి మోసం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని విమర్శించారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ పార్టీకి ఉచిత పథకాలు గుర్తుకు వస్తాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వందరోజులైనా ఒక్క పథకం అమలు చేయలేదని మండిపడ్డారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి రూ.టలక్షల పంట రుణమాఫీ అంటూ ప్రచారం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు రాసకొండ రవి, శ్రీనివాస్, మల్లేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నర్సయ్యపల్లి గ్రామ శివారులోని నేహా కాన్సెప్ట్ స్కూల్ సమీప రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా రాంనగర్‌కు చెందిన తొటం రాములు(69) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాములు తన చిన్నకూతురు కవిత, అల్లుడు ఎలిగేటి తిరుపతి, మనవళ్లు అశ్విత్, విదుస్‌తో కలిసి కారులో మంచిర్యాల నుంచి హైదారాబాద్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వెనకాల వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారులోని రాములుకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్లాడరు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి అల్లుడు, కూతురు, మనవళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి

- అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్


ఓదెల(పెద్దపల్లి): గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సూచించారు. కొలనూర్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యంలో కోత విధించారని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ యాకన్న, ఆర్‌ఐలు రాజేందర్, నర్సింగ్, స్వశక్తి మహిళలు రజిత, స్వప్న పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల వద్ద కోతలు వద్దు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కొనుగోలు తరలిస్తున్న ధాన్యంలో రైస్ మిల్లర్లు కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. కాల్వశ్రీరాంపూర్ ఐకేపీ, మొట్లపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. ఆరబోసిన ధాన్యాన్ని తాలులేకుండా ప్యాడీక్లీనర్ల ద్వారా శుభ్రపరచాలని రైతులకు సూచించారు. నిల్వచేసిన వడ్లు అకాల వర్షాలకు తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ జాహెద్ పాషా, సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈత నేర్వమంటివి కదా కొడుకా..

- కనిపించకుండా పోతివి కొడుకా..
- తడగొండలో ఈతకు వెళ్లి బాలుడి మృతి


మణితేజ (ఫైల్)


విలపిస్తున్న తల్లి

బోయినపల్లి(చొప్పదండి): 'సెలవులచ్చినయి దోస్తులు ఈత నేర్చుకుంటుండ్రు.. ఈత నేర్పమంటివి కదా కొడుకా.. కనిపించకుండా పోతివా కొడుకా..' అని ఆ తల్లి రోదన అక్కడి వారి హృదయాలను కలచివేసింది. ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఏడో తరగతి విద్యార్థి చేపూరి మణితేజ(12) బావిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండకు చెందిన చేపూరి తిరుమల-గంగయ్యలకు మణితేజ, రిత్విక్ కొడుకులు. పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో ఈత నేర్చుకునేందుకు తండ్రి గంగయ్య, తాత రామయ్యలతో కలిసి గత మూడు రోజులుగా మణితేజ వెళ్తున్నాడు. గ్రామంలోని తాటివనం పరిసరాల్లోని వందురునూతిలో ఓ రోజు తాత, మరో రోజు తండ్రి ఈత నేర్పుతున్నారు. మణితేజ తాత రామయ్య శుక్రవారం గంగాధర మండలం చర్లపల్లికి వెళ్లగా.. తండ్రి గంగయ్యతో కలిసి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అదే బావిలో మరికొందరు సైతం ఈత కొడుతున్నారు. ఈక్రమంలో ఈత కొడుతుండగా మణితేజ మునిగిపోయాడు. పది గజాల లోతులో నీళ్లు ఉండడంతో ఎంత వెదికినా బాలుడి ఆచూకీ లభించలేదు. మోటార్లు పెట్టి నీరు తీసే ప్రయత్నం చేసినా ఖాళీ కాలేదు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం ఇవ్వగా.. గజ ఈతగాళ్లు వచ్చి తెప్ప సాయంతో మణితేజ మృతదేహాన్ని బయటకు తెచ్చారు. బావిలో మణితేజ గల్లంతయ్యాడని తెలియడంతో గ్రామస్తులందరూ అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయగానే తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు పంచాయతీ కార్యదర్శి మృతి


సాయిలు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై కారు, స్కూటీ ఢీకొన్న సంఘటనలో రిటైర్డు పంచాయతీ కార్యదర్శి దుర్మరణం చెందారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన రిటైర్డు పంచాయతీ కార్యదర్శి అబ్రమేని సాయిలు(66) శుక్రవారం స్కూటీపై పొలం పనులకు వెళ్తుండగా.. సిద్దిపేట వైపు నుంచి వస్తున్న కారు వేగంగా స్కూటీని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సాయిలును సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉదయం ఇంటి వద్ద టిఫిన్ చేసి వెళ్లిన సాయిలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే విషయం తెలుసుకున్న భార్య పరమేశ్వరీ, కూతుళ్లు వెన్నెల, అర్చనల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటరమణ తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం

సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆవునూర్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి కుటుంబీకులతో కారులో సిద్దిపేట నుంచి ఆవునూర్‌కు వస్తున్నారు. వీరి కారు హన్మాన్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వైపు వస్తుండగా సాయిలు స్కూటీని ఢీకొట్టింది. కారు వేగంగా ఉండడంతో రోడ్డు కిందికి వెళ్లింది. అక్కడ పెద్ద బండరాయి ఉండడంతో కారు బోల్తా పడలేదు. కారులో ఉన్న విజయభాస్కర్ రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు.

శ్రీలంక అమ్మాయి.. మేడిపల్లి అబ్బాయి


వివాహం చేసుకుంటున్న జంట

రాయికల్: ఉద్యోగం కోసం జోర్డాన్ దేశం వెళ్లిన మేడిపల్లి అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో హిందూసాంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. మెట్‌పల్లి మండలం మూడుబొమ్మల మేడిపల్లి గ్రామానికి చెందిన జొరిగె అశోక్ ఉద్యోగం కోసం జోర్డాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ శ్రీలంక దేశానికి చెందిన సమన్వి పరిచయమైంది. ఇరువురి మధ్య ప్రేమ చిగురించింది. వీరి ప్రేమకు కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో అశోక్ అక్కాబావలైన రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన చేగంటి శేఖర్-పూజితలు హిందూ సాంప్రదాయ ప్రకారం భూపతిపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వీరి వివాహం జరిపారు. దంపతులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ సర్పంచులు వాసరి రవి, మాజీ ఎంపీటీసీ బెజ్జంకి మోహన్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు ఆశీర్వదించారు.

ఎడ్‌టాక్స్‌లో పారమిత విద్యార్థుల ప్రదర్శన


ఎడ్‌టాక్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్: అంతర్జాతీయ స్థాయిలో అమెరికా వారు నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఎడ్‌టాక్స్ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని స్థానిక కరీంనగర్ మైత్రి కన్వెన్షన్ వేదికగా పారమిత ఎడ్‌టాక్స్ కార్యక్రమంలో పారమిత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఐదో తరగతికి చెందిన పెంచాల మాన్వి లైఫ్ స్కిల్స్ అనే అంశంపై, రసపల్లి హదస్సది త్రియూనిక్‌నెస్ అనే అంశంపై, ఆరో తరగతికి చెందిన సిద్రా ఆఫ్ షీన్ ఇంపాక్ట్ ఆఫ్ సోషియల్ మీడియా ఆన్ హ్యూమన్ బీయింగ్స్ అనే అంశంపై, ఏడో తరగతికి చెందిన సయ్యద్ జక్వాన్ హుస్సేన్ ప్లాట్యూస్ ఆఫ్ లాటెంట్ పొటెన్షియల్ అనే అంశంపై, తోట హర్షిత్ ఏషియాంట్ ఇండియా ఆజ్ మోడ్రెన్ ఇండియా అనే అంశంపై, చీరాల లాలిత్య కృష్ణ ప్రణవి పర్సనల్ ఐడెంటిటీ అనే అంశంపై తమ అద్భుతమైన ప్రసంగాలతో శ్రోతల్లో ఆలోచనా దృక్పథాన్ని పెంచారు. పారమిత పాఠశాలల అధినేత ప్రసాద్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, రామచందర్‌రావు, నిఖిల్, జ్యోతి, రవీంద్రచారి, అనంతచారి, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, రితేష్ మెహత, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన 'తేజస్' విద్యార్థులు


విజయ సంకేతం చూపుతున్న తేజస్ చైర్మన్ సతీష్‌రావు, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారు. కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను తేజస్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ కరస్పాండెంట్ సీహెచ్ సతీష్‌రావు బొకెలతో అభినందిస్తూ సన్మానించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 470కు గాను కనకట్ల మారుతి, మెర్రి రాజేశ్ 466 మార్కులు, ముక్కెర దేవేందర్ 465, ముదిగొండ మల్లికార్జున్ 464, అరుకొండ సంజయ్ 461, మంగళారపు సాయిప్రణయ్ 460, ఆర్.తరుణ్ 438 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. బైపీసీలో 440 మార్కులకు గాను మంతెన సన్నీ 435, గుగులోతు రాజశేఖర్ 431 మార్కులు, సీఈసీ ఫస్టియర్‌లో ముక్కెర మనోజ్‌కుమార్ 469 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్ సెకండియర్‌లో 1000 మార్కులకు గాను తాపల్ల గణేశ్ 983, ఉత్కం హర్షిత్ 981 మార్కులు, సీఈసీలో కాలువ అభిషేక్ 902 మార్కులతో రాణించారని పేర్కొన్నారు.